ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 297 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 3 ఫిబ్రవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# కుల గణన సర్వే వివరాలు వెల్లడి

- ఓసీల జనాభా 15.79 శాతం, కులగణన అంశంపై ముగిసిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం
- మంత్రి ఉత్తమ్‌కుమార్ అధ్యక్షతన సమావేశమైన సబ్‌కమిటీ
- రాష్ట్రంలో కులగణనపై మంత్రివర్గ ఉపసంఘానికి అందిన నివేదిక
- ముఖ్యాంశాలు వెల్లడించిన మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ప్రభాత ఉదయం): వెనుకబడిన తరగతులకు న్యాయం చేయాలన్నదే తమ ఆకాంక్ష అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా రాష్ట్రంలో కులగణన అంశంపై కేబినెట్ సబ్ కమిటీకి(మంత్రివర్గ ఉపసంఘం) నివేదిక అందజేశారు. కులగణనపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ ముగిసిన అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ ఆశయం మేరకు రాష్ట్రంలో సామాజిక, కులగణన సర్వే చేపట్టామని ఆయన వెల్లడించారు.

### 96.9శాతం మంది వివరాలందించారు :

స్వాతంత్ర్యం పూర్వం నుంచి మనదేశంలో జనగణన జరుగుతోందని, అసలైన పేదలను గుర్తించేందుకు కులగణన మాత్రం జరగలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కులగణన చేయాలని అసెంబ్లీ తీర్మానించిందని వివరించారు. బలహీనవర్గాల అభ్యున్నతికి అవసరమైన వివరాల సేకరణకు కులగణన చేపట్టామన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి సామాజిక కులగణన సర్వేలో 1,03,889 మంది

..మిగతా 2లో



# అదరగొట్టిన అమ్మాయిలు

## అండర్ -19 టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌లో భారత్ ఘన విజయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2 (ప్రభాత ఉదయం): వుమెన్స్ అండర్-19 టీ20 వరల్డ్ కప్‌లో భారత్ ఘన విజయం సాధించింది. ఈ విజయంతో వరుసగా రెండోసారి అండర్ 19 వరల్డ్ కప్‌లో టీమిండియా గెలుపొందింది. ఆదివారం సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో విజయం సాధించి విశ్వవిజేతగా నిలిచింది. సఫారీ జట్టు నిర్దేశించిన 83 పరుగుల లక్ష్యాన్ని, టీమిండియా అమ్మాయిలు 11.2 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి ఛేదించారు. గొంగడి త్రిష 33 బంతుల్లో 44 పరుగులు (8ఐ4) చేసి నాటౌట్‌గా నిలిచింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 82 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్ల విజృంభనతో సఫారీ జట్టు విలవిల్లాడింది. మికీ వాన్ (23 పరుగులు)టాప్ స్కోరర్. నలుగురు ప్లేయర్లు పరుగుల

..మిగతా 3లో

## త్రిష లాంటి క్రీడాకారులు తెలంగాణకు గర్వ కారణం: సీఎం రేవంత్‌రెడ్డి

2

# ఢిల్లీలో త్వరలో కొత్త వసంతం



## మార్చి 8న మహిళల ఖాతాల్లో.. ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2 (ప్రభాత ఉదయం): ఢిల్లీలో త్వరలో కొత్త వసంతం రాబోతున్నదని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఈసారి ఢిల్లీలో బీజేపీదే అధికారమని ఆయన చెప్పారు. ఫిబ్రవరి 8న బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు

..మిగతా 2లో

# మళ్లీ మాదే విజయం..




## ఓటమి భయంతో బీజేపీ గూండాయిజం : కేజ్రీవాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2 (ప్రభాత ఉదయం): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో మళ్లీ విజయం తమదేనని ఆప్ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ అన్నారు. ఆప్ చారిత్రాత్మక విజయం దిశగా దూసుకెళ్తుండగా.. బీజేపీ పరిస్థితి రోజురోజుకు దిగజారిపోయిందని ఎద్దేవా చేశారు. ఓటమి భయంతో బీజేపీ నేతలు ఢిల్లీలో గూండాయిజం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలపై దాడులు చేస్తున్న బీజేపీ శ్రేణులపై చర్యలు తీసుకోకుండా పోలీసులకు ఆదేశాలు వెళ్లాయని కేజ్రీవాల్ విమర్శించారు. ఢిల్లీలో ఈ విధమైన ఎన్నికలను ప్రజలు ఇంతకుముందు ఎప్పుడూ చూడలేదని కేజ్రీవాల్ అన్నారు. బీజేపీ గూండాయిజానికి వ్యతిరేకంగా అందరం ఏకం కావాల్సిన అవసరం

..మిగతా 2లో

## కుంభమేళాకు 20 రోజుల్లోనే
# 33 కోట్ల మంది

### వసంత పంచమి వేళ మరింత రద్దీ!
### 5న ప్రయాగ్‌రాజ్‌కు ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2 (ప్రభాత ఉదయం): మహాకుంభమేళా నేపథ్యంలో వసంత పంచమి నాడు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. మౌని అమావాస్య రోజున చోటుచేసుకున్న తొక్కిసలాటతో అప్రమత్తమైన యూపీ సర్కార్.. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఎటువంటి తప్పిదం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించి ప్రభుత్వం.. సీనియర్ ఐఏఎస్‌లను రంగంలోకి దింపింది. జనవరి 13న కుంభమేళా ప్రారంభం కాగా.. ఫిబ్రవరి 1వ తేదీ వరకు ప్రయాగ్‌రాజ్‌లో సుమారు 33కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ ప్రభుత్వం అంచనా వేసింది. శనివారం 2.15కోట్ల మంది రాగా.. ఆదివారం మధ్యాహ్నం 12గంటల వరకే 90లక్షల మంది భక్తులు స్నానాలు ఆచరించినట్లు తెలిపింది. వసంత పంచమి పురస్కరించుకొని సోమవారం 4 నుంచి 6కోట్ల మంది రానున్నట్లు అధికారులు

..మిగతా 2లో

## కేంద్రంపై యుద్ధం ప్రకటించి రాష్ట్రానికి
# నిధులు సాధించాలి

### మహేశ్ కుమార్‌గౌడ్

### బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ నిరసన



హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ప్రభాత ఉదయం): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ నిరసన చేపట్టింది. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌తో పాటు పలువురు పార్టీ నేతలు, కార్యకర్తుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ... సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా మోదీ సర్కార్ వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. దేశాభివృద్ధికి తెలంగాణ రాష్ట్రం ఎంతో సహాయపడుతుంటే.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం పట్ల వివక్ష చూపిందన్నారు. కేంద్రం వివక్షను ప్రజాక్షేత్రంలోనే ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులకు సాయం చేయాలని పలుసార్లు కేంద్రానికి నివేదికలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. " నిధుల కేటాయింపుల్లో రాష్ట్రానికి ఏటా అన్యాయం జరుగుతోంది. జీడీపీలో రాష్ట్ర వాటా 5 శాతం ఉన్నా తెలంగాణకు ఎప్పుడూ మొండిచేయే. కేంద్రంపై యుద్ధం ప్రకటించి రాష్ట్రానికి నిధులు సాధించాలి. అన్ని పార్టీలు ఏకమై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. కేంద్రంపై పోరాటానికి భారాస కూడా కలిసి రావాలి" అని మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ వివక్షతను రాష్ట్ర ప్రజలంతా ఖండించాలని మంత్రి సీతక్క కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్, సీనియర్ నేతలు షబ్బీర్ అలీ, చిన్నారెడ్డి తదితరులు నిరసనలో పాల్గొన్నారు.



## రేవంత్‌రెడ్డి సర్కారు
# 'హనీమూన్' ముగిసింది

### రుణమాఫీ పూర్తయినట్లు నిరూపిస్తే
### రాజకీయాల నుంచి వైదొలగుతా: కేటీఆర్

పరిగి, ఫిబ్రవరి 2 (ప్రభాత ఉదయం): రేవంత్‌రెడ్డి సర్కారు హనీమూన్ కాలం ముగిసిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం దాస్యానాయక్ తండాలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఏర్పాటైన అంబేడ్కర్ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డితో కలిసి కేటీఆర్ శనివారం ఆవిష్కరించారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ జరిగినట్లు నిరూపిస్తే.. తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొంటానని సవాల్ విసిరారు. సీఎం సొంతూరికి లేదా పరిగి ఎమ్మెల్యే స్వగ్రామం శివారెడ్డిపల్లికి వస్తా.. అమలు చేసిన హామీలు చూపించాలని డిమాండ్ చేశారు. 'మీరు (సీఎం) వచ్చినా రాకపోయినా కొడంగల్‌కు దండయాత్రగా వెళ్తాం. కేసీఆర్‌కు, రేవంత్‌కు పోలికే లేదు. కేసీఆర్ అంటే

..మిగతా 4లో




## త్రిష లాంటి క్రీడాకారులు

# తెలంగాణకు గర్వ కారణం

## సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ప్రభాత ఉదయం): వరుసగా రెండోసారి అండర్-19 మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకున్న టీమిండియా జట్టును సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. హైదరాబాద్: వరుసగా రెండోసారి అండర్-19 మహిళల ప్రపంచ కప్‌ను గెలుచుకున్న టీమిండియా జట్టును సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతమైన ఆటతో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ బిడ్డ గొంగడి త్రిషకు సీఎం.. ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మలేషియాలో సౌత్ ఆఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించి ఇండియా జట్టు విశ్వవిజేతగా నిలిచింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి చెందిన త్రిష ఆల్ రౌండ్ ప్రతిభతో అద్భుత ఆటను ప్రదర్శించారు. దూకుడుగా ఆడి చివరి వరకు నిలబడి సత్తా చాటారు. టోర్నీలో అత్యధిక పరుగులు సాధించి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచారు. త్రిష లాంటి క్రీడాకారులు తెలంగాణకు గర్వకారణమని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. త్రిష మరింతగా రాణించి భవిష్యత్తులో టీమిండియా సీనియర్ జట్టులో చోటు దక్కించుకోవాలని ఆకాంక్షించారు. అద్భుతమైన క్రీడా నైపుణ్యమున్న యువతీ యువకులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని భరోసా ఇచ్చారు.

# మళ్లీ మాదే విజయం

మొదటి పేజీ తరువాయి...

ఉందని ఢిల్లీ ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ గూండాయిజాన్ని దేశం దృష్టికి తెచ్చేందుకు ప్రత్యేక హ్యాష్‌ట్యాగ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ లేదా అధికార యంత్రాంగం దాడులు చేసినా, వేధింపులకు గురిచేసినా ఈ హ్యాష్‌ట్యాగ్ ద్వారా సమాచారం ఇవ్వాలని కేజ్రీవాల్ కోరారు. మీకు జరగకపోయినా ఏదైనా ఘటన మీ దృష్టికి వస్తే 'అమిత్ షా గుండాగిరి హ్యాష్‌ట్యాగ్'ను వాడి తమకు సమాచారం ఇవ్వాలని కేజ్రీవాల్ సూచించారు. పోలీసులు మీతో తప్పుగా వ్యవహరించినా, అధికారులు లేదా బీజేపీ నేతలు మిమ్మల్ని వేధింపులకు గురిచేసినా హ్యాష్‌ట్యాగ్ ద్వారా తెలియజేయాలన్నారు. అమిత్‌షా ఢిల్లీ ప్రజలపై ఏ విధంగా గూండాగిరి చేస్తున్నరో దేశం మొత్తం చూస్తున్నదని వ్యాఖ్యానించారు. బీజేపీ మనలను భయపెట్టడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా మనం బెదరవద్దని సూచించారు. అంతేగాక, ఢిల్లీ ఎన్నికలకు ముందు మురికివాడల్లో నివసించే, ఆర్థికంగా బలహీనులైన వర్గాల వారి ఓటు హక్కును తొలగించడానికి పెద్ద కుట్ర జరుగుతోందని అర్వింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. అంతేకాదు సర్వెంట్ క్వార్టర్స్, ధోబీ ఘాట్లు, మురికివాడల్లో నివసించేవారి నుంచి తనకు చాలా కాల్స్ వస్తున్నాయని, ఓటర్లకు రూ.3000 చొప్పున ఇస్తున్నారని ఆయన అన్నారు.

## కుల గణన సర్వే

# వివరాలు వెల్లడి

మొదటి పేజీ తరువాయి...

ఎన్యుమరేటర్లు పాల్గొన్నారని తెలిపారు. 96.9శాతం (3.50 కోట్ల మంది) మంది సర్వేలో పాల్గొని వివరాలను అందించారని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. 3.1శాతం (16లక్షల మంది) వివిధ కారణాల వల్ల వివరాలు అందించలేదని తెలిపారు.

**కేబినెట్‌లో చర్చించి శాసనసభలో ప్రవేశపెడతాం :**

ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉపాధి ఇతర అంశాలపై సమగ్ర అధ్యయనం జరిగిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సర్వేను అడ్డుకోవాలని కొందరు ప్రయత్నించినా అధికారులు విజయవంతంగా పూర్తి చేశారని వివరించారు. ఈనెల 4న మంత్రివర్గం ముందు కులగణన సర్వే నివేదిక ప్రవేశపెడతాని ఆయన వెల్లడించారు. కేబినెట్‌లో చర్చించి వెంటనే శాసనసభలో ప్రవేశ పెడతామన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాజంలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ముందుకెళ్తోందని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, సీతక్క తదితరులు పాల్గొన్నారు.

**కులగణన సర్వేలోని ముఖ్యాంశాలు ఇవే :**

తెలంగాణ రాష్ట్రంలోని 3,54,77,554 మంది వివరాల నమోదు.
మొత్తం 1,12,15,131 కుటుంబాల వివరాలు నమోదు చేశారు.
కులగణన సర్వేలో పాల్గొన్న జనాభా 96.90 శాతం మంది.
కులగణన సర్వేలో పాల్గొనని జనాభా 3.10 శాతం మంది
కులగణన సర్వే ప్రకారం తెలంగాణలో ఎస్సీల జనాభా 17.43 శాతం
ఎస్టీల జనాభా : 10.45 శాతం మంది
రాష్ట్రంలో బీసీల జనాభా : 46.25 శాతం మంది
రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల బీసీల జనాభా 10.08 శాతం మంది
ముస్లిం మైనారిటీ బీసీలు సహా మొత్తం బీసీల జనాభా 56.33 శాతం
రాష్ట్రంలో ముస్లిం మైనారిటీ ఓసీల జనాభా 2.48 శాతం
రాష్ట్రంలో మొత్తం ముస్లిం మైనారిటీల జనాభా 12.56 శాతం
రాష్ట్రంలో మొత్తం ఓసీల జనాభా 15.79 శాతం

# ఢిల్లీలో త్వరలో కొత్త వసంతం

మొదటి పేజీ తరువాయి...

చేస్తుందని, మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల ఖాతాల్లో రూ.2,500 చొప్పున పడుతాయని హామీ ఇచ్చారు. ఆర్కే పురం ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ప్రధాని మోదీ.. ఆప్ ప్రభుత్వం అసత్యాలు ప్రచారం చేస్తోందని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఢిల్లీలో ఏ ఒక్క గుడిసెను తొలగించబోమని, సంక్షేమ పథకాలను రద్దు చేయబోమని, అన్ని సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని ప్రధాని స్పష్టంచేశారు. ఆరోగ్య రంగంలోనూ 'ఆపద' ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని, ప్రజలను దోచుకున్నవారు తిరిగి ఇచ్చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నెహ్రూ హయాంలో రూ.12 లక్షల ఆదాయం ఉంటే నాల్గో వంతు వేతనాన్ని ప్రభుత్వం ట్యాక్స్ రూపంలో వెనక్కి తీసుకునేదని, ఇందిర హయాంలో అయితే రూ.12లక్షల ఆదాయంపై దాదాపు రూ.10 లక్షలు ట్యాక్స్ రూపంలో పోయేవని ఆయన గుర్తుచేశారు. పదిపన్నెండేళ్లకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.12 లక్షలు సంపాదిస్తే రూ.2.60 లక్షలు ట్యాక్స్ రూపంలో ఇవ్వాల్సి వచ్చేదని, బీజేపీ తాజా బడ్జెట్ తర్వాత ఏడాదికి రూ.12 లక్షలు సంపాదించేవారు కూడా ఒక్క రూపాయి పన్ను కట్టాల్సిన అవసరం లేదని ప్రధాని చెప్పారు. సోమవారం వసంత పంచమి వస్తోందని, ఆ తర్వాత వాతావరణంలో మార్పు ప్రారంభమవుతుందని అన్నారు. ఫిబ్రవరి 5న ఢిల్లీలో అభివృద్ధికి సంబంధించిన కొత్త వసంతం రానుందని చెప్పారు. ఢిల్లీలో ఓటింగ్‌కు ముందే చీపురు పుల్లలు ఒక్కొక్కటి ఊడిపోతున్నాయని, ఆప్ నాయకులు ఆ పార్టీని వదిలి వెళ్తున్నారని అన్నారు.

# పాతవి రావు.. కొత్తవీ లేవు

### బడ్జెట్‌లో రాష్ట్రానికి మళ్లీ నిరాశే
### రాష్ట్ర ప్రభుత్వ విన్నపాలు గాలికి..
### ప్రాధాన్య ప్రాజెక్టులకూ రిక్తహస్తం



హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ప్రభాత ఉదయం): కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపింది. రాష్ట్రానికి సంబంధించిన ఏ ఒక్క పథకానికి గానీ, ప్రాజెక్టుకు గానీ బడ్జెట్‌లో చోటు దక్కలేదు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రాజెక్టుల కోసం ప్రతిపాదనలిచ్చినా, ఫలితం కనిపించలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు ఇచ్చిన వినతులపైనా స్పందించలేదు. కొత్త ప్రాజెక్టులు, కార్యక్రమాల్లోనూ రాష్ట్రానికి చోటు దక్కలేదు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో మరోసారి 'తెలంగాణ' పదం వినిపించకుండా పోయిందని రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రధాన ప్రతిపక్షం భారాస తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాయి.

**అన్నీ పెండింగే**

విభజన హామీలకు సంబంధించిన ప్రతిపాదనలు దీర్ఘకాలంగా పెండింగులో ఉన్నాయి. బయ్యారం ఉక్కు కర్మాగారం, ఐఐఎం వంటి ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటు వంటివి.. ఈ జాబితాలో ఉన్నాయి. ప్రధానంగా మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో భారీ ఉక్కు కర్మాగారం నిర్మించాలని రాష్ట్రం కోరుతోంది. దీనిపై వివిధ ప్రతిపాదనలున్నా.. ఇప్పటి వరకు మంజూరు కాలేదు. కాజీపేటలో రైల్వే కోచ్‌ల తయారీ కర్మాగారంపైనా అధికారిక ప్రకటన వెలువడలేదు. గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినా.. పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. ఏళ్ల తరబడి డిమాండ్ల మేరకు పసుపు బోర్డు ఏర్పాటు చేసినా, బడ్జెట్లో దానికి నిధులు కేటాయించకపోవడం గమనార్హం. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, నవోదయ కళాశాలలు, సైనిక పాఠశాలలతో పాటు కొత్త వైద్యకళాశాలల ఏర్పాటుపైనా కేంద్రం నుంచి స్పందన లేదు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టేందుకు సన్నద్ధమవుతోంది. వీటికి భారీగా నిధులు అవసరమవుతాయని, కేంద్రం సాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా దిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఇతర కేంద్రమంత్రులకు వినతిపత్రాలు సమర్పించారు. సీఎం, ఆయా శాఖల మంత్రులు కేంద్రానికి లేఖలు రాసి గుర్తుకు తెస్తున్నారు. ఆయా శాఖల కార్యదర్శులు, డైరెక్టర్లు సైతం దిల్లీకి వెళ్లి కేంద్ర కార్యదర్శులను కలుస్తున్నారు.. అయినా కేంద్రం నుంచి స్పందన లేదు.

**నిధులు తక్షణావసరమైనా..**

కేంద్ర బడ్జెట్‌కు ముందు ప్రతిసారీ పెండింగు, కొత్త ప్రాజెక్టులు, ఇతర ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తు చేస్తోంది. రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, మూసీ పునరుజ్జీవ పథకం సహా తొమ్మిది ప్రాజెక్టులకు రూ. 1.63 లక్షల కోట్లు కావాలని కేంద్రాన్ని కోరింది. ఇంకా సెమీకండక్టర్ మిషన్, సింగరేణికి కొత్త బొగ్గు గనులు కావాలని రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నెలలుగా కేంద్రాన్ని కోరుతోంది. ఈసారి కూడా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర సీనియర్ అధికారులు దిల్లీకి వెళ్లి కేంద్ర క్యాబినెట్ సెక్రటరీ సహా పలువురు ఉన్నతాధికారులను కలిసి ప్రతిపాదనలు సమర్పించారు. పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులకు అటవీ శాఖ అనుమతులు, విద్యుత్ బస్సుల కొనుగోలుకు రాయితీలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 20 లక్షల ఇళ్లు, విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్, వ్యవసాయంలో సౌరవిద్యుత్ పంపుసెట్ల వినియోగానికి ప్రోత్సాహకాలు, ఫీడర్ స్థాయిలో సౌర విద్యుత్ వినియోగానికి అనుమతులు, విద్యుత్ అభివృద్ధి నిధి తదితరాలు కావాలని విన్నవించారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ వడ్డీ తగ్గించాలని, సంప్రదాయేతర విద్యుత్ కొనుగోలుపై జరిమానాను మినహాయించాలని, సంప్రదాయేతర విద్యుత్ నిర్వహణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రాలు సమర్పించినా కేంద్రం కరుణించలేదు. తాజా బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు సూక్ష్మ పరిశీలన చేశారు. ఏ శాఖ ద్వారా కూడా తెలంగాణ ప్రత్యక్ష ప్రయోజనాలు పొందే పథకాలు, కార్యక్రమాలు కనిపించలేదు. పరోక్ష ప్రయోజనాలను అన్వేషించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అధికారులు తెలిపారు.

# గచ్చిబౌలి కాల్పుల ఘటన కేసు

### మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ ప్రభాకర్‌ను విచారిస్తున్న పోలీసులు
### ప్రభాకర్‌ను విచారిస్తున్న సీసీఎస్, ఎస్‌వోటీ క్రైమ్ బృందాలు
### ప్రభాకర్‌పై తెలుగు రాష్ట్రాల్లో 80 కేసులు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ లోని గచ్చిబౌలిలో కలకలం సృష్టించిన కాల్పుల ఘటన కేసులో విచారణ కొనసాగుతోంది. మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బత్తుల ప్రభాకర్ అలియాస్ రాహుల్‌రెడ్డిని శనివారమే అరెస్టు చేసిన పోలీసులు విచారిస్తున్నారు. సీసీఎస్, ఎస్‌వోటీ క్రైమ్ బృందాలు నిందితుడి నుంచి వివరాలు రాబట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పటికే నిందితుడి నుంచి 2 తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని బిహార్ నుంచి కొనుగోలు చేసినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడు ప్రభాకర్‌పై తెలుగు రాష్ట్రాల్లో 80 వరకూ చోరీ కేసులు ఉన్నాయి. ఇంతకీ ఏం జరిగిందంటే : ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాకు చెందిన బత్తుల ప్రభాకర్ పాత నేరస్థుడు. 2022 మార్చి నెలలో విచారణ నిమిత్తం అనకాపల్లి కోర్టుకు తీసుకెళ్లిన సమయంలో తప్పించుకుపోయాడు. అప్పటినుంచి నిందితుడు పరారీలో ఉన్నాడు. ఇటీవల సైబరాబాద్ పరిధిలోని మొయినాబాద్, నార్సింగి పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు చోరీలు చేశాడు. కాగా నిందితుడు ఎక్కువగా ఇంజినీరింగ్ కాలేజీల్లో చోరీ చేస్తుంటాడు. ప్రవేశాలు, పరీక్షలు, హాస్టల్ ఫీజు డబ్బులు కళాశాలల్లో ఉంటాయని పక్కా పథకంతో చోరీలు చేస్తాడు. ఇటీవల నార్సింగి, మొయినాబాద్‌లో జరిగినటువంటి చోరీల్లో వేలిముద్రల్ని విశ్లేషించగా ప్రభాకర్ వేలిముద్రలతో సరిపోలాయి. నిందితుడి కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు దోపిడీ చేసిన డబ్బుతో వీకెండ్స్‌లో పబ్‌కు వెళ్తున్నట్లుగా సీసీ ఫుటేజీల్లో గుర్తించారు. ఐటీ కారిడార్‌లోని పబ్‌ల సిబ్బంది, బౌన్సర్లకు నిందితుడికి సంబంధించిన ఫొటోలిచ్చి ఆచూకీ తెలిస్తే




సమాచారమివ్వాలని సూచించారు. ప్రభాకర్ శనివారం సాయంత్రం 7.10 గంటల సమయంలో గచ్చిబౌలిలో ఉన్నటువంటి ప్రిజం పబ్ దగ్గర ప్రత్యక్షమయ్యాడు. గుర్తించిన బౌన్సర్లు పబ్‌ను 7.30 గంటలకు తెరుస్తారని అప్పటివరకూ ఎదురుచూడాలని అతడికి చెప్పారు. మద్యం సేవించి ఉన్న నిందితుడు ఫోన్ ఛార్జర్ అడగ్గా ఇచ్చారు. పక్కకు వెళ్లి ఛార్జింగ్ పెట్టుకునే సమయంలో పోలీసులకు నిందితుడి గురించి సమాచారమిచ్చారు. 7.30 గంటల సమయంలో సైబరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్(సీసీఎస్) హెడ్ కానిస్టేబుల్ వెంకట్రామిరెడ్డితో పాటు కానిస్టేబుళ్లు ప్రదీప్‌రెడ్డి, వీరస్వామి మఫ్టీలో వచ్చారు. నిందితుడిని పోలీసులు పట్టుకునేందుకు ప్రయత్నించేలోపు అతడు తుపాకీతో రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. హెడ్ కానిస్టేబుల్ వెంకట్రామిరెడ్డి పాదం నుంచి ఒక తూటా దూసుకెళ్లడంతో గాయపడ్డాడు. ఉలిక్కిపడ్డ సహచర కానిస్టేబుళ్లు బౌన్సర్ల సాయంతో నిందితుడిని అడ్డుకుని అదుపులోకి తీసుకుని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు

## కిమ్స్ ఆసుపత్రిలో శ్రీతేజ్‌ను పరామర్శించిన

# నిర్మాత బన్నీ వాసు

### సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ప్రభాత ఉదయం): సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను నిర్మాత బన్నీ వాసు పరామర్శించారు. రెండు నెలలుగా సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో బాలుడు చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శ్రీతేజ్‌కు అందుతున్న చికిత్స గురించి బన్నీ వాసు అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం విదేశాలకు తీసుకెళ్తామని చెప్పారు. శ్రీతేజ్ వైద్య ఖర్చులు భరిస్తామని తెలిపారు. తొమ్మిదేళ్ల బాలుడు శ్రీతేజ్ దాదాపు రెండు నెలలుగా ఆసుపత్రికే పరిమితమయ్యాడు. అయినా బాలుడి ఆరోగ్య పరిస్థితిలో పెద్దగా మార్పు లేదు. తొక్కిసలాట తర్వాత బాలుడిని పక్కకు తీసుకెళ్లిన పోలీసులు సీపీఆర్ చేశారు. వెంటనే సికింద్రాబాద్ కిమ్స్‌కు తరలించారు. కొన్ని రోజులపాటు ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. సొంతంగా ఆక్సిజన్ పీల్చుకోవడంతో వెంటిలేటర్‌ను తొలగించి ప్రత్యేక గదికి మార్చారు. అప్పటి నుంచి అతను ఆసుపత్రిలో మంచానికే పరిమితమయ్యాడు. పేరుపెట్టి పిలిచినా కళ్లు తెరిచి చూడలేదు. నోరు విప్పి మాట్లాడలేదు. ఇప్పటివరకు ముక్కు వద్ద అమర్చిన సన్నని గొట్టం ద్వారానే లిక్విడ్ ఆహారం అందిస్తున్నారు. వైద్య సిబ్బంది ఫిజియోథెరపీ చేపడుతున్నారు. అయినా ఆరోగ్య పరిస్థితిలో పెద్దగా మార్పు లేదు. ఎప్పుడు కోలుకుంటాడో వైద్యులు కూడా



చెప్పలేని పరిస్థితి. శరీరంలో ఇతర జీవ ప్రక్రియలన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ శ్రీతేజ్ నుంచి స్థిరమైన ప్రతిస్పందనలు ఉండటం లేదని వైద్యులు చెబుతున్నారు.

## కుంభమేళాకు 20 రోజుల్లోనే

# 33 కోట్ల మంది

మొదటి పేజీ తరువాయి...

అంచనా వేస్తున్నారు. మరోవైపు కుంభమేళాకు ప్రముఖుల తాకిడి కూడా పెరుగుతోంది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌కు వచ్చివెళ్లగా.. ఫిబ్రవరి 5న ప్రధాని మోదీ రాక కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

**అమెరికా జనాభాతో సమానంగా యాత్రికులు**

మౌని అమావాస్య రోజున కోట్లాది మంది ప్రయాగ్‌రాజ్ రావడం, సెక్టార్ 2లో జరిగిన తొక్కిసలాటలో 30 మంది చనిపోయిన నేపథ్యంలో క్రౌడ్ మేనేజిమెంట్‌పై అధికారులు మరింత దృష్టి సారించారు. 2019లో అర్ధ కుంభమేళా సమయంలో పనిచేసిన ఐఏఎస్ అధికారులు ఆశీష్ గోయల్, భానుచంద్ర గోస్వామిలను రంగంలోకి దించారు. వీరిద్దరు మేళా అధికారి విజయ్ కిరణ్ ఆనంద్‌తో కలిసి పని చేయనున్నారు. అదనపు డీజీపీ భాను భాస్కర్ కూడా రద్దీ నియంత్రణ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం ఘాట్‌లను పరిశీలించిన ఆయన.. స్నానాల తర్వాత ఘాట్‌ల వద్ద కాలక్షేపం చేయవద్దని సూచించారు. ఇతరుల కోసం ఆ ప్రదేశాన్ని ఖాళీ చేయాలని, ఘాట్‌ల వద్ద భోజనాలు చేయవద్దని చెబుతున్నారు. విశ్రాంతి కోసం భక్తులు నిర్దేశించిన ప్రాంతాలకు వెళ్లాలని మైకెల్లో ప్రకటనలు చేశారు. ఇదిలాఉంటే, కుంభమేళా సమయంలో సంక్రాంతి, మౌని అమావాస్య, వసంత పంచమిలను పవిత్ర రోజులుగా భావిస్తారు. వీటితోపాటు మాఘ పూర్ణిమ (ఫిబ్రవరి 12), మహా శివరాత్రి (ఫిబ్రవరి 26) రోజుల్లోనూ అమృత స్నానం ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు వచ్చే అవకాశం ఉంది.

## వైఎస్ షర్మిలతో సీక్రెట్‌గా విజయసాయి రెడ్డి భేటీ

### వైసీపీలో మొదలైన కంగారు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ప్రభాత ఉదయం): ఏపీ రాజకీయాల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. రాజకీయాల నుంచి తప్పుకొని వ్యవసాయం చేస్తానని ప్రకటించిన విజయసాయిరెడ్డి.. ఏపీ కాంగ్రెస్ ఛీఫ్ వైఎస్ షర్మిలతో మూడు రోజుల క్రితం సీక్రెట్‌గా సమావేశమైనట్లు తెలుస్తోంది. జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న విజయసాయి రెడ్డి.. షర్మిలను కలిశారనే విషయం ఇప్పుడు వైసీపీలో కలకలం రేపింది. మూడు రోజుల క్రితం విజయసాయిరెడ్డి హైదరాబాద్ వెళ్లి.. లోటస్‌పాండ్‌లోని షర్మిలను సీక్రెట్‌గా కలిశారని ఒక వార్త బయటకొచ్చింది. దాదాపు 3 గంటల పాటు రాజకీయ అంశాలపై వారిద్దరూ రాజకీయ అంశాలపై చర్చించారని సమాచారం. అంతేకాదు మధ్యాహ్నం భోజనం కూడా షర్మిల ఇంట్లోనే చేశారని తెలుస్తోంది. ఎంత సీక్రెట్‌గా వీళ్ల భేటీ జరిగినప్పటికీ.. ఏదోలా ఈ విషయం ఇప్పుడు బయటకు పొక్కింది. దీంతో ఏపీ రాజకీయాల్లో ఏం జరుగుతుందని వైసీపీ శ్రేణులతో పాటు మిగతా పార్టీలు ఆశ్చర్యపోయి చూస్తున్నాయి. జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న విజయసాయిరెడ్డి.. అన్ని వేళలా ఆయనకు అండగా ఉన్నారు. గతంలో అన్నాచెల్లెళ్ల మధ్య ఆస్తుల వివాదం తలెత్తినప్పుడు కూడా జగన్‌కు మద్దతిస్తూ.. షర్మిలతో విభేధించారు. అది కాకుండా వైఎస్ వివేకానంద రెడ్డి గుండెపోటుతో మరణించారని విజయసాయి చేసిన ప్రకటనపైనా అభ్యంతరం తెలిపారు. వైఎస్ వివేకా హత్య కేసులో నిజాలు బయటపెట్టాలని కూడా షర్మిల సూచించారు. షర్మిలపై విజయసాయి కూడా పలు సందర్భాల్లో విమర్శలు చేశారు.

# కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలి



కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్



పావురాల పెంటతో దుర్గంధంగా మారిన స్పోర్ట్స్ కాంప్లెక్స్

## సీపీఎం రాజేం ద్రనగర్ మండల కార్యదర్శి జె.రుద్రకుమార్

బుద్వేల్, ఫిబ్రవరి2(ప్రభాత ఉదయం): కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను ఆదివారం సీపీఎం రాజేం ద్రనగర్ మండల కార్యదర్శి జె.రుద్రకుమార్ అధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సందర్శించారు. పావురాల పెంట, అపరిశుభ్రమైన వాతావారణంలో నిరుప యోగంగా ఉన్న కాటేదాన్ స్పోర్ట్స్ కాం ప్లెక్స్ ను ను చూసి అవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జె.రుద్రకుమార్, సీనియర్ నాయకులు జి. కురుమయ్యలు మాట్లాడుతూ, 2008లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ రూ. 5 కోట్ల వ్యయంతో నిర్మించడానికి శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. ఆ పనులు 17 సంవత్సరాల పాటు కొనసాగి రూ. 24కోట్లతో పనులు జరిగాయన్నారు. దాన్ని గత ఎన్నికల ముందు హడావిడిగా ప్రారంభించుకున్నారని, అయితే అది క్రీడాకారులకు ఏ మాత్రం ఉపయోగంగా లేకుండ ఉందన్నారు. ఇండోర్ స్టేడియంలో పావురాల పెంటతో నిండిపోయిం దన్నారు. ఆడుకోవడానికి క్రీడా సామాగ్రి లేదన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. రూ. 6.5 కోట్లతో నిర్మించిన స్విమ్మింగ్ పూల్ గోడలు కట్టి వదిలిపెట్టారన్నారు. స్విమ్మింగ్ పూల్ లో నీరే లేదన్నారు. అన్నింటికి మించి కోట్లాది రూపాయలతో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆలనా పాలన చూసుకోవడానికి ఒక్క అధికారి గానీ, చివరకు వాచ్మెన్ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. గ్రేటర్ అధికారులకు, రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులకు ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పై ఎంత ప్రేమ ఉందో దీని బట్టి తెలుస్తుందన్నారు. ప్రజా ప్రతినిధులు ఏం చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. ఇప్పటికైన అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కాటేదాన్ చుట్టుపక్కల ఉన్న యువకులు ఆడుకోవడానికి అనుకూలంగా కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను అభివృద్ధి చేయాలని జె.రుద్రకుమార్, జి.కురుమయ్యలు డిమాండ్ చేశారు. లేనట్లయితే సీపీఎం అధ్వర్యంలో యువకులను తీసుకువచ్చి కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



స్పెషల్ డ్రైవ్ లో పాల్గొన్న ట్రాఫిక్ పోలీసులు

# లైసెన్సు లేకుండ వాహనాలు నడుపుతున్న 20 మందిపై కేసులు నమోదు

బుద్వేల్, ఫిబ్రవరి2 (ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు ఆదివారం సాయంత్రం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మైనర్ లు వాహనాలు నడిపితే పట్టుకున్నారు. లైసెన్సు లు లేకుండ వాహనాలను నడుపుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ రాజేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆరాంఘర్ చౌరస్తా, పీడీపీ చౌరస్తా, అత్తాపూర్ ప్రాంతాలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పది మంది మైనర్లు వాహనాలు నడుపుతుండగా వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. లైసెన్సులు లేకుండ వాహనాలు నడుపుతున్న 20 మందిపై కేసులు పెట్టారు. ఈ సందర్భంగా ఇన్స్ పెక్టర్ రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ, చిన్నారులకు వారి తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదన్నారు. లైసెన్సులు లేకుండ ఎవరు వాహనాలు నడపరాదాన్నారు. అలా చేస్తే ట్రాఫిక్ నిభందనల ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.



# నేడు కిస్మత్‌పూర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

బండ్లగూడ, ఫిబ్రవరి 2(ప్రభాత ఉదయం) కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో సోమవారం వివిధ మరల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్ తెలిపారు. డిఫెన్స్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన ఆర్మీ నిర్మాణ, ట్రంప్ విల్లా, సాయిబాబా కాలనీ, డిఫెన్స్ కాలనీ, రామ్కీ విల్లా, ఖాదర్ ఎన్.ఆర్.ఐ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.



నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ అండ్ పంచాయతీ రాజ్ కార్యాలయం

# బడ్జెట్ కేటాయింపులు లేకపోతే మా బ్రతుకులెట్లా ?

బుద్వేల్ ఫిబ్రవరి 2 (ప్రభాత ఉదయం): దేశ విదేశాలకు చెందిన వేలాది మంది గ్రామీణాభివృద్ధి రంగ నిపుణులకు, ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడమే కాకుండ గ్రామీణాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి గ్రామ సీమల అభివృద్ధికి బంగారు బాటలు వేసిన రాజేంద్రనగర్ లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీర్ సంస్థ (ఎన్ఐఆర్డీ పీఆర్ ) భవిష్యత్ ప్రస్తుతం -ప్రశ్నార్ధకంగా మారింది. 2025-26 కేంద్ర బడ్జెట్లో ఎన్ఐఆర్డీపీఆర్ కు రూపాయి కూడా కేటాయించకపోవడమే ఇందుకు నిదర్శనం. గత బడ్జెట్ లో రూ. 73 కోట్లు కేటాయించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఈ యేడాది ఎన్ఐఆర్డీ పీఆర్ కు గుండు సున్నా పెట్టింది. దీనిపై సంవత్సర కాలంగా చర్చలు జరుగుతున్నప్పటికి అవన్ని ఉన్నతాధికారుల మద్యలోనే జరిగినట్లు తెలుస్తుంది. అడ్మినిస్ట్రేటివ్ స్టాప్ కాలేజ్ అప్ ఇండియా (ఆస్కి) మాదిరిగా ఎన్ఐఆర్డీ పీఆర్ కూడా నిదులను శిక్షణ, అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా సమకూర్చుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ చెబుతోంది. అంతేకాకుండ ఈ సంస్థ లో రూరలో డైవెలప్మెంట్ పై పీజీ కోర్సులను ప్రవేశపెడుతుంది. భవిష్యత్ లో ఎన్ఐఆర్డీ పీఆర్ ను డీమ్డ్ యూనివర్సిటీగా మార్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులకు మాస్టర్స్ ప్రోగ్రామ్ లను అందించి దాని ద్వారా ఆర్థిక వనరులను సమకూర్చుకోవచ్చని సూచనలు చేస్తుంది. అందులో బాగంగానే ఈ సంవత్సరం ఎన్ఐఆర్డీ పీఆర్ కు బడ్జెట్ లో కేటాయింపులు జరుపలేదని తెలుస్తుంది.

### పూర్తి స్థాయిలో బడ్జెట్ ను సమకూర్చుకోగలదా :

ఎన్ఐఆర్డీ పీఆర్ కు కేంద్ర ప్రభుత్వం ప్రతి యేటా రూ. 73 నుంచి రూ. 80 కోట్ల వరకు గ్రాంటు గా ఇస్తు వస్తుంది. అంత మొత్తంలో ప్రస్తుతం శిక్షణ కార్యక్రమాలు చేపట్టి సమకూర్చుకుంటుందా అనే ప్రశ్న ప్రతి ఒక్కరి లో తలెత్తుతుంది. రాజేంద్రనగర్ లో ప్రధాన కార్యాలయం ఉండటంతో పాటు న్యూ డిల్లీ, గౌహతీ, వైశాలీ లో ఆ సంస్థకు బ్రాంచ్ కార్యాలయాలు ఉన్నాయి. వీటన్నిటి నిర్వహణ సాధ్యమేనా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

### ఏప్రిల్ నెల నుంచి జీతాలు ఎట్లా అనే అందోళనలో ఉద్యోగులు :

ఎన్ఐఆర్డీ పీఆర్ లో 222 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరే కాకుండ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. 300 మంది వరకు పెన్షనర్లు ఉన్నారు. వీరి కుటుంబాలు ఎన్ఐఆర్డీపీఆర్ సంస్థ ఇచ్చే వేతనాలు, ఫెన్షన్లపైనే ఆధారపడి ఉన్నాయి. మార్చి నాటికి ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అయిపోతే వచ్చే ఏప్రిలె నుంచి మా జీతాలు ఎలా అనే ఆలోచనలో ఉద్యోగులు ఉన్నారు. పెన్షనర్లు తమ కు ఫెన్షన్ వస్తుందా అనే భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నుంచి ప్రత్యక్ష కార్యచరణకు దిగుదాం అనే అలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది.

# బుద్వేల్ గ్రీన్ సిటీలో ఈదమ్మ, నాగదేవతల విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు



బుద్వేల్ గ్రీన్ సిటీ లో పునర్నిర్మాణం చేసిన ఈదమ్మ దేవాలయ ప్రతిష్టాపన పూజలలో పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్



ఈదమ్మ తల్లి ని కుటుంబ సమేతంగా దర్శించుకున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

బుద్వేల్, ఫిబ్రవరి2(ప్రభాత ఉదయం) : బుద్వేల్ గ్రీన్ సిటీ లో పురాతన ఈదమ్మ తల్లి దేవాలయాన్ని పునర్నిర్మాణం చేసి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 9:18 గంటలకు నాగదేవత, శ్రీ మాంధాతా, భద్రకాళీ, వీరభద్ర, సింహవాహన, శిఖర దేవతా విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో రాజేంద్రనగర్, ముషీరాబాద్ ఎమ్మెల్యేలు టి. ప్రకాశ్ గౌడ్, ముఠా గోపాల్ లు పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. ముఠా గోపాల్ కుటుంబ సమేతంగా ఈదమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టా పూజలలో పాల్గొన్నారు. బుద్వేల్ బస్తీ పెద్దలు, దేవాలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరిగిన పూజా కార్యక్రమాలు, ఆదివారం జరిగిన విగ్రహ ప్రతిష్టాపన పూజలను శ్రీ మాతా చండీ ఉపాసకలు రేవల్లి రాజు శర్మ చేతుల మీదుగా నిర్వహించారు. బుద్వేల్, గ్రీన్ సటీ. న్యూ గ్రీన్ సిటీ, బృందావన్ కాలనీ, సాయిక్రిష్ణ కాలనీ, శివసాయి కాలనీ, శ్రీ క్రిష్ణ కాలనీ, కిష్టమ్మగుట్ట, భగపతీగూడ పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట పూజలలో పాల్గొన్నారు.

### అమ్మవారికి బోనాలు సమర్పణ :

మూడు రోజుల పాటు పూజలందుకుని నాలుగో రోజైన ఆదివారం ప్రతిష్టించిన శ్రీ ఈదమ్మ తల్లికి బుద్వేల్ పరిసర బస్తీల ప్రజలు బోనాలు సమర్పించారు. మద్యాహ్నం ఒంటి గంటల నుంచి బోనాల'తో మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈదమ్మ తల్లి దేవాలయ పునర్నిర్మాణం, ప్రతిష్టా మహోత్సవాలు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి దేవాలయ దర్మకర్తల మండలి, బుద్వేల్ పెద్దల తరపున ధన్యవాదాలు తెలియజేశారు.

# 1.5 కిలో మీటర్ల దూరాన్ని 33 నిమిషాలలో ఈది బహుమతి గెలుచుకున్న జి.పుల్లారెడ్డి


బుద్వేల్, ఫిబ్రవరి2(ప్రభాత ఉదయం): 25వ కృష్ణా రివర్ క్రాస్ ఈత పోటీలలో రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్ గూడ కు చెందిన జి.పుల్లారెడ్డి బహుమతి గెలుచుకున్నారు. అమరావతి కరకట్ట ఉండవల్లి లైలాగంగరాజు నగర్, ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 1. 5 కిలో మీటర్ల దూరం ఈత పోటీలను నిర్వహించారు. విజయవాడ దుర్గాఘాట్ నుంచి ప్రకాశం బ్యారేజ్ చివర ఉన్న లోటస్ సిటీ పుడ్ వరకు 1.5 కిలో మీటర్ల రివర్ క్రాస్ చేయాల్సి ఉంటుంది. 51 నుంచి 60 సంవత్సరాల వయస్సు విభాగంలో పుల్లారెడ్డి పాల్గొని 33 నిమిషాలలో 1.5 కిలో మీటర్ల దూరాన్ని ఈది బహుమతిని గెలుచుకున్నారు. నిర్వాహకులు వెలగపూడి వెం కటేశ్వర్ రావు. ఈవెంట్ కన్వీనర్ డాక్టర్ యుగంధర్ ల చేతుల మీదుగా ఆయన బహుమతిని అందుకున్నారు. ఈత పోటీలలో పాల్గొని 1.5 కిలో మీటర్ల దూరాన్ని 33 నిమిషాలలో పూర్తి చేసిన జి.పుల్లారెడ్డిని కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు.




మెడల్‌తో పాటు సర్టిఫికెట్‌ను తీసుకుంటున్న గంగిడి పుల్లా రెడ్డి



మంద కృష్ణ మాదిగ




పోతురాజు యాదయ్య మాదిగ

# వెయ్యి గొంతులు- లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నేడు బుద్వేల్ బాబు జగ్జీవన్ రాం విగ్రహం ఆవరణలో సాయంత్రం 4 గంటలకు సన్నాహక సమావేశం

బుద్వేల్, ఫిబ్రవరి 2(ప్రభాత ఉదయం): మాదిగ, మాదిగ ఉప కులాల రాజకీయ నాయకులు, ప్రజాసంఘాలు, కుల సంఘాల నాయకులందరు సోమవారం సాయంత్రం 4 గంటలకు బుద్వేల్ బాబు జగ్జీవన్ రాం విగ్రహం వద్దకు రావాలని మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోతురాజు యాదయ్య మాదిగ కోరారు. సుప్రీంకోర్టు ఆయా ఆయా రాష్ట్రాలలో జనాభా లెక్క ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేసుకోవాలని తీర్పునివ్వడం జరిగిందని గుర్తు చేశారు. అందుకు అనుకూలంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాక్షాత్తు అసెంబ్లీ లో భారత దేశంలో గల ఇతర రాష్ట్రాల కంటే ముందు ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీ లుగా వర్గీకరణ చేస్తామని తెలిపి నేటికీ చేయలేదన్నారు. దానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఫిబ్రవరి 7న హైదరాబాదులో వేయి గొంతులు లక్షల డప్పుల కార్యక్రమాన్ని చేపడుతున్నారని తెలిపారు. అందుకు అనుగుణంగా రాజేంద్రనగర్ సర్కిల్ నుండి పెద్ద ఎత్తున పాల్గొనేందుకు కార్యచరణ చేయడానికి ఈ ఈ సమావేశము ఏర్పాటు చేయడమైనదన్నారు. అందరూ సమయానికి హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# అదరగొట్టిన అమ్మాయిలు

మొదటి పేజీ తరువాయి...

ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరారు. భారత జట్టు బౌలర్లలో త్రిష 3, పరునిక, ఆయూషి, వైష్ణవి తలో 2, షబ్నమ్ 1 వికెట్ తీశారు.

### అదరగొట్టిన తెలంగాణ అమ్మాయి త్రిష

ఈ టోర్నీలో తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష అద్భుతంగా రాణించింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో దుమ్మురేపింది. ఈ టోర్నీలో సెంచరీ బాదేసింది. ఫైనల్‌లోనూ మూడు వికెట్లతో రాణించి, విజయానికి కారణమై అందరి దృష్టిని ఆకర్షించింది. ఇక ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా గొంగడి త్రిష నిలిచింది.

# లక్షల డప్పులు, వేల గొంతులు, కోట్లాది ప్రజలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



ప్రేమావతిపేట్ లో డప్పులు కొడుతూ ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బుద్వేల్, ఫిబ్రవరి2(ప్రభాత ఉదయం): ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా రాష్ట్రాలు వర్గీకరిం చుకోవచ్చు అని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 7న నగరంలో చేపట్టనున్న లక్షల డప్పులు, వేల గొంతులు, కోట్లాది ప్రజలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివారం ప్రేమావతిపేట్ బస్తీలో ప్రచారం చేశారు. ప్రేమావతిపేట్ జై రాం, జై భీమ్ సంఘం అధ్యక్షుడు గోల్కొండ రాజ్ కుమార్, ఎడ్లకాడి సూర్యం ల అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్ జాతీయ ఉపాధ్యక్షుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కో ఆర్డినేటర్ మదిలేటి మాదిగ, రాష్ట్ర ఉ పాధ్యక్షులు క్యాసారం శంకర్ రావు మాదిగ, మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోతురాజు యాదయ్య మాదిగ లు పాల్గొన్నారు. డప్పులు కొడుతు ఇంటింటికి వెళ్లి కర పత్రాలను పంపిణీ చేశారు. బీసీ రిజర్వేషన్లు ఏవిధంగానైతే ఏబీసీడీలుగా ఉన్నాయో ఆ మాదిరిగానే ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించి షెడ్యుల్డ్ కులాలలో ఉన్న 59 ఉప కులాలకు సమానంగా పంచాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద క్రిష్ణామాదిగ నాయకత్వంలో 30 సంవత్సరాలుగా పోరాడుతున్నామన్నారు. ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించే అధికారం రాష్ట్రాలకు ఇస్తు 2024 ఆగస్టు 1వ తేదీన సుప్రీం కోర్టు తీర్పు చెప్పిందన్నారు. ఆ తీర్పును మొట్ట మె దటగా తెలంగాణ రాష్ట్రంలోనే అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు అమలు చేయకుండ దాటవేత దోరణి అవలంభిస్తున్నారన్నారు. అంతేకాకుండ ఉద్యోగాల నోటిఫికేషన్లు కూడా ఇచ్చారన్నారు. అందుకే మంద క్రిష్ణామాదిగ నేతృత్వంలో అన్ని కుల సం ఘాలను కలుపుకుని ఈ నెల 7న నగరంలో లక్షల డప్పులు - వేల గొంతులు కోట్లాది ప్రజల కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి మాదిగ ఇంటి నుంచి అందరు నగరానికి తరలిరావాలన్నారు. అంతేకాకుండ మాదిగలకు మద్దతు తెలుపుతున్న అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ జై రామ్ సంఘం ఉపాధ్యక్షులు లేవిరాజ్, ఉపేందర్, కోశాధికారి ఎడ్లకాడి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు కాసారం మహేశ్, సుమన్, గౌతమ్, నాని, నవీన్, హరీష్, బైండ్ల నర్సింగ్ రావు, బాబురావు, ఆగపల్లి నర్సింహ్మా, అనిల్ కుమార్, రాము, హర్ష, మోజెస్, కోరని క్రిష్ణ, డి.మైసయ్య, బాలమణి, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాదిగ లు



ట్రోఫీలు అందుకుంటున్న క్రీడాకారులు

## జాతీయస్థాయి కరాటే పోటీలలో ఛాంపియన్షిప్ సాధించిన కొత్తకోట వెల్టూర్

### విద్యార్థులకు ఛాంపియన్షిప్ అందజేసిన మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ

### వనపర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో గెలుపొందిన కనిమెట్ట విద్యార్థులు

కొత్తకోట, ఫిబ్రవరి2(ప్రభాత ఉదయం) రాష్ట్ర జాతీయస్థాయి కరాటే పోటీలలో కొత్తకోట వెల్టూరు విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచారు. జడ్చర్ల పట్టణంలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీలలో పాల్గొన్న కొత్తకోట వెల్టూరు విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచి ఛాంపియన్ సాధించారు .ఈ ఛాంపియన్షిప్ ను మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ చేతుల మీదుగా అందుకున్నారు. వనపర్తి జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో కొత్తకోట మండల కనిమెట్ట విద్యార్థులలో చక్కటి ప్రతిభ కనబరిచి పథకాలు సాధించారు.గాడ్స్ ఆన్ వారియర్స్ షోతో ఖాన్ కరాటే డు ఇండియా ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంటున్నారు. విద్యార్థులకు చక్కటి శిక్షణ ఇచ్చిన మాస్టర్స్ లను ప్రత్యేకంగా అభినందించారు .జి హరీష్ యాదవ్ జాఫర్ సాదిక్ , స్కూల్ ప్రిన్సిపాల్ విష ని ముఖ్య అతిథిగా విచ్చేసిన మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ చేతుల మీదుగా ఛాంపియన్షిప్ అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మరో ముఖ్య అతిథి మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పాల్గొని సీనియర్ మాస్టర్స్ ఎండీ ఇంతియాజ్, రఫీ, ఖాద్రి, ఎండి కైసర్ పరమేష్ లను క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.



నూతన వదూ వరులను ఆశీర్వదిస్తున్న నాయకులు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు

కొత్తకోట, ఫిబ్రవరి 2(ప్రభాత ఉదయం) మున్సిపాలిటీ కేంద్రంలో ఆదివారం ఆనంద్ కన్వెన్షన్ హాలులో జరిగిన వివాహ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది . ఈ వివాహ వేడుకల్లో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కొత్తకోట కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్తకోట పట్టణానికి చెందిన నాగరాల సరోజ సత్యనారాయణ రెడ్డి ఏకైక పుత్రుడు చిన్నారెడ్డి తో వైష్ణవి రెడ్డి వీరిద్దరూ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. పెండ్లి వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి,ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, గుడిబండ నరోత్తం రెడ్డి, ఈ శాంత రెడ్డి,పి రవీందర్ రెడ్డి, వనపర్తి కృష్ణారెడ్డి, నగరాల తిరుపతిరెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, గంగారం బాల్ రెడ్డి లను అర్చకులు వేదాశీర్వచనం ద్వారా అక్షింతలతో నూతన జంటను ఆశీర్వదించారు.



## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ డైరీ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 2 (ప్రభాత ఉదయం) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ నివాసం వద్ద రోజువారి కార్యాచరణలో భాగంగా నియోజవర్గం ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ పలువురి ఆహ్వానాలను, వినతిపత్రలను స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి గెజిటెడ్ ఆఫీసర్స్ అధ్యక్షులు వినోద్ కుమార్, ఉపాధ్యక్షులు దాసరి రవీందర్, కార్యదర్శి కురుమూర్తి, నియోజకవర్గం ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి సర్కారు 'హనీమూన్' ముగిసింది

మొదటి పేజీ తరువాయి...

ఒక హిస్టరీ.. రేవంత్ అంటే ఒక లాటరీ. తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం కేసీఆర్ పేరుంటుంది. సమయం వచ్చినపుడు కేసీఆర్ బయటకు వస్తారు. 71 ఏళ్ల కేసీఆర్‌ను కర్రసాయం లేకుండా అసెంబ్లీకి రమ్మంటున్నారు. మీకు దమ్ముంటే ఎలాంటి సెక్యూరిటీ లేకుండా లగచర్లకు రావాలి. తులం బంగారం, స్కూటీలు, ఉపకార వేతనాలు, రైతుబంధు, ఇవేవీ అమలు కాలేదు. చివరకు సఫాయి సిబ్బందికి కూడా వేతనాలు పడటం లేదు. భారాస పాలనలో పదేళ్లపాటు అభివృద్ధిని, సంక్షేమాన్ని జోడెద్దుల మాదిరిగా ముందుకు తీసుకువెళ్లాం. కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని జైలుకు పంపింది. ప్రజల కోసం చేసే పోరాటంలో కేసులకు భయపడేది లేదు' అని కేటీఆర్ స్పష్టం చేశారు. లగచర్ల కేసులో బెయిల్‌పై విడుదలైన సురేష్, గోపాల్‌నాయక్‌లను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, సబితారెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, ఆనంద్, నరేందర్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, బాల్కసుమన్, పార్టీ నాయకుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, సేవాలాల్ సేన వ్యవస్థాపకుడు సంజూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ స్థాయిలో జిల్లా గుర్తింపు పొందేలా కృషి చేయాలి





గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి2(ప్రభాత ఉదయం)గద్వాల జిల్లా క్రికెట్ రంగంలో ఉత్తమ ప్రతిభను కనబరిచి, రాష్ట్రం, దేశ స్థాయిలో గుర్తింపు పొందేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో షేర్ అలీ ప్రీమియర్ లీగ్ %-% సీజన్ 2 క్రికెట్ పోటీలను జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా నైపుణ్యం సాధించాలని సూచించారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాల్లో ప్రతిరోజూ శిక్షణ తీసుకోవాలని సూచించారు. గద్వాల్ జిల్లాలో ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు షేర్ అలీ ప్రీమియర్ లీగ్ పోటీలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని అన్నారు. ఫిబ్రవరి 2 నుండి 9 వరకు జరిగే ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఆరు జట్లు పోటీ పడుతున్నట్లు తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయిన వారు నిరుత్సాహపడకుండా మళ్లీ గెలిచేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం క్రికెట్ పోటీలను ప్రారంభించేందుకు శాంతి ప్రతీకలైన పావురాలను ఆకాశంలోకి వదిలి, స్వయంగా బ్యాటింగ్ చేసి తొలి బంతి ఆడారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మల్లికార్జున్, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి జితేందర్, న్యాయవాది భీమ్ సేన్ రావు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## చింతరేవుల ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు ఘనంగా చేయాలి

### గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి2(ప్రభాత ఉదయం)ధరూర్ మండలం పెద్ద చింతరేవుల వెలసిన శ్రీ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం శ్రీఆంజనేయ స్వామి వారిని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తో పాటు కాంగ్రెస్ నాయకులు దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారిని ఆలయ నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. సోమవారం జరిగే శ్రీ ఆంజనే యస్వామి రథోత్సవానికి ఇప్పటివరకు చేపట్టిన పనులను పరిశీలించారు. భక్తులకు టాయిలెట్స్, మంచినీరు, వీధి దీపాలు, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆలయ ఈవో, పోలీసులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే వెంటా ధరూర్ మాజీ జెడ్పిటిసి పద్మావెంకటేశ్వర రెడ్డి మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి నాయకులు వేణుగోపాల్ , ఆలయ ధర్మకర్త సి.గిరిరావు, ప్రధాన అర్చకులు, తదితరులు ఉన్నారు.



ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

## మధ్యతరగతి కుటుంబాలకు బ్యాంకెట్ హాల్‌లు ఎంతో దోహదపడతాయి

### "శుభమస్తు" బ్యాంకెట్ హాల్ ను ప్రారంభించిన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 2 (ప్రభాత ఉదయం) కుత్బుల్లా పూర్ నియోజకవర్గం, గాజుల రామారం డివిజన్ మహదేవ్ పురంలో నిర్వాహకులు కోటగడ్డ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన "శుభమస్తు" బ్యాంకెట్ హాల్ ను ఆదివారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాగు అనుగుణంగా ఇంట్లో శుభకార్యాలు నిర్వహించుకోలేని వారికి బ్యాంకెట్ హాల్ లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. మహదేవపురంలో ఇలాంటి బ్యాంకెట్ హాల్ సరసమైన ధరలకు అందిస్తున్న కొట్టగడ్డ శ్రీనివాస్ ని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలుకుల జగన్, మంత్రి సత్యనారాయణ, హేమలత సురేష్ రెడ్డి, జగద్గిరిగుట్ట ఇన్స్పెక్టర్ నరసింహ, టి యు డబ్ల్యూ జే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, టియుడబ్ల్యూజే ఐజేయు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజ్, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షులు రుద్రా అశోక్, యువ నాయకులు కొలుకుల జైహింద్, జగద్గిరి గుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, నాయకులు మూసా ఖాన్, చిన్నా చౌదరి, మల్లేష్, శశిధర్, ఇమ్రాన్, అసిఫ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వివేకానందను సన్మానిస్తున్న బంకేట్ హాల్ యజమాన్యం

## కేంద్ర బడ్జెట్లో తెలంగాణ ఊసే లేదు

### కొత్తకోట మండల సిపిఎం కార్యదర్శి బొబ్బిలి నిక్సన్



కొత్తకోట, ఫిబ్రవరి 2(ప్రభాత ఉదయం) కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ 2025-26 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి ప్రయోజనం లేకుండా ఊసే లేదని కొత్తకోట సిపిఎం మండల కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ ఆరోపించారు. సిపిఎం పార్టీ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇద్దరు బిజెపి మంత్రులు ఎనిమిది మంది ఎంపీలు ఉన్నప్పటికీ రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టలేకపోయారని రాష్ట్ర విభజన హామీలు గాలికొదిలేసారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో విమానాశ్రయాలు ఏర్పాటుకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఐ ఎఫ్ ఎం హై స్పీడ్ రైల్వే ట్రాక్ లకు నిధులు ఊసే లేదని ఆయన చెప్పారు. రాబోయేఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కొన్ని రాష్ట్రాలకు మాత్రమే నిధులు కేటాయించారని రూ50, 65,345 కోట్లతో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో రు 12,76,338 కోట్లు అనగా 25.2% వడ్డీల చెల్లింపులకే కేటాయించాలని వ్యవసాయ రంగానికి గతం కన్నా రూ 10 వేల కోట్లు తగ్గించారని ఎరువుల సబ్సిడీకి రు 11 వేల కోట్లు తగ్గించారని ఆయన ఆరోపించారు. ప్రధాని మోడీ దేశంలో 25 కోట్లు మందిని దారిద్ర రేఖకు ఎగువకు తెచ్చామని చెబుతూనే 2029 వరకు 80 కోట్లు మందికి 5 కిలోల చొప్పున రేషన్ షాపుల ద్వారా ఉచిత బియ్యాన్ని పంపిణీ చేస్తామని చెప్పి. ఉపాధి హామీ పథకానికి 2023- 24 లో 89, 154 కోట్లు ఖర్చు చేయగా ప్రస్తుతం బడ్జెట్లో 86 వేల కోట్లు మాత్రమే కేటాయించారని ఆయన ఆరోపించారు. దళిత గిరిజనులకు బడ్జెట్, సబ్ ప్లాన్ కింద చేసిన కేటాయింపులు ఆ వర్గాల అభివృద్ధికి ఏమాత్రం ఉపయోగపడడం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ వర్గాలకు కేటాయించిన నిధులను నోడల్ ఆఫీసర్ ద్వారా అవాసులు రహదారులు త్రాగునీరు విద్య వైద్య సౌకర్యాలు కల్పించినచో ఆ వర్గాలలో కొంతమేరకైనా జరుగుతుంది దళితులకు 16% కేటాయించాల్సిన ఉండగా ఐదు శాతం నిధులు మాత్రమే కేటాయించారని గిరిజనులకు ఏడు శాతం నిధులు కేటాయింపునకు బదులు రెండు శాతం కేటాయించి విద్య వైద్య రంగాలకు చాలా స్వల్పంగా కేటాయింపులు మూడు శాతానికి లోపే కేటాయింపులు జరిగాయని ఆయన విమర్శించారు. పారిశ్రామిక రంగం ఉత్పత్తికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కార్పొరేట్లకు పన్ను రాయితీలు బ్యాంకుల అప్పుల ఎగవేతకు అవకాశం కల్పిస్తూ తయారుచేసిన ఈ బడ్జెట్ అని ఆయన ఆరోపించారు. పారిశ్రామిక వ్యవసాయ అభివృద్ధికి అనుకూలంగా తీర్చిదిద్దాలని వలసలను ఆత్మహత్యలను నిరోధించే విధంగా బడ్జెట్ రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నర్సింలు, కే రాములు,వెంకటన్న, రాజు, నాగన్న,విజయ్,రాములు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## కుంట వీధి క్రికెట్ లీగ్ విజేతగా కేఎస్ ఈవెంట్ హాల్ జట్టు







గద్వాల: గద్వాలలోని శ్రీ శ్రీ గుంటి చెన్నకేశవ స్వామి జాతర సందర్భంగా బండల పాండు యూత్ ఆధ్వర్యంలో తేరు మైదానం లో నిర్వహిస్తున్న కుంట వీధి క్రికెట్ లీగ్ సీజన్ -1 క్రికెట్ మ్యాచ్ లు అట్టహాసంగా ముగిసాయి. ఆదివారం జరిగిన ఫైనల్‌మ్యాచ్ లో కేఎస్ ఈవెంట్ హాల్ వర్సెస్ లడ్డు లయన్స్ తలపడ్డాయి. కేఎస్ ఈవెంట్ హాల్ లో మొదట బ్యాటింగ్ దిగి 12ఓవర్లలో 147 పరుగులు చేసి 6 వికెట్లు కోల్పోగా, తర్వాత బ్యాటింగ్ దిగిన లడ్డు లయన్స్ 12ఓవర్లలో 96 పరుగులు చేసి 6వికెట్లు కోల్పోయి ఓటమి చవిచూసింది. కుంట వీధి క్రికెట్ లీగ్ -1 విజేతగా కేఎస్ ఈవెంట్ హాల్ జట్టు నిలిచింది. రన్నరప్ జట్టుగా లడ్డు వారియర్స్ జట్టు నిలిచింది. మొదటి బహుమతి రూ.30,000, రెండవ బహుమతి రూ.20000 దాతలు మురారి సోమశేఖర్ రెడ్డి అండ్ బ్రదర్స్ అందజేశారు. విన్నర్ గా కేఎస్ ఈవెంట్ హాల్, రన్నర్ గా లడ్డు లయన్స్ నిలిచిన జట్లకు బిజెపి నాయకులు బండల వెంకట రాములు మరియు త్యాగరాజ్,బండల పాండు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కృష్ణంరాజు, శంకర్, పవన్, టోర్నమెంట్ ఆర్గనైజర్లు తెలుగు కేశవ్ ,మని ,రామకృష్ణ,నవీన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608